**ప్రజల మాట ప్రగతి బాట**

**కామారెడ్డి**
**నియోజకవర్గం**

# కాంగ్రెస్ హయాంలోనే కరెంట్ కష్టాలు



పోతారంలో మాట్లాడుతున్న గంప గోవర్ధన్



ఇసాయిపేటలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు గజమాల వేస్తున్న నాయకులు

మాచారెడ్డి, నవంబర్ 19 : ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ హయాంలో కరెంట్ కష్టాలు మాటల్లో చెప్పలేనివని.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం హయాంలో కరెంట్ కష్టలు పూర్తిగా తొలగిపోయి రైతులు సంతోషంగా ఉన్నారని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ఆదివారం పాల్వంచ మండంలోని సింగరాయిపల్లి, పోతారం, ఇసాయిపేట, మంథనిదేవునిపల్లి, వాడి, ఫరీద్‌పేట, బండరామేశ్వర్‌పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

- **సీఎం కేసీఆర్ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు**
- **బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రజలకు ఎంతో మేలు..**
- **ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్**

సీఎం కేసీఆర్ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెల్లరేషన్ కార్డులో ఉన్న సభ్యులందరికీ కేసీఆర్ బీమా ద్వారా భరోసా కల్పించనున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ఈసారి హ్యాట్రిక్ కొడతారని, దేశం చూపు కామారెడ్డి వైపు ఉన్నదని అన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసరా పింఛన్లు రూ.5 వేలకు, దివ్యాంగులకు రూ.6 వేలు చేయనున్నారని తెలిపారు. ఇప్పుడు ఉన్న రైతుబంధు రూ.16 వేలకు పెరుగనున్నదని, బీఆర్ఎస్ మ్యానిఫెస్టో సామాన్య ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తుందని అన్నారు. కామారెడ్డి నుంచి పోటీచేస్తున్న రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల కరెంట్ చాలని, 10 హెచ్‌పీ మోటర్ ద్వారా మూడు గంటల్లో మూడు ఎకరాలు పారియవచ్చని అన్నడు ఈయన ఎప్పుడైనా వ్యవసాయం చేసిండా అని ప్రశ్నించారు. రైతులకు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే ఒక్కొక్కరికీ రూ.లక్షా 50 వేలు ఖర్చు అవుతుందని, ఇది సాధ్యమవుతుందా అని.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే నట్టెట్లో ముంచుతాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ హయాంలోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని, కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామాల్లో అంతకుముందు గంప గోవర్ధన్‌కు బోనాలతో ఘనస్వాగతం పలికి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింగ్‌రావు, జడ్పీటీసీ రాంరెడ్డి, బాల్‌చంద్రం, రాజాగౌడ్, కమలాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆజ్ కీ తస్వీర్



## ఏం కాకా మంచిగున్నవా..

మాచారెడ్డి మండలం సింగరాయిపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓ ఇంటి వద్ద వృద్ధుడిని చూసి దగ్గరకు వెళ్లి ఏం కాకా మంచిగున్నవా.. అని ఆప్యాయంగా అడిగారు. పింఛన్ వస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. కారు గుర్తుకు ఓటు వేసి సీఎం కేసీఆర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

– మాచారెడ్డి, నవంబర్ 19

# ప్రచార హోరు.. బీఆర్ఎస్ జోరు

- **మ్యానిఫెస్టోను వివరిస్తూ..**
- **పట్టణంతోపాటు అన్ని గ్రామాల్లో గడపగడపకూ బీఆర్ఎస్ నాయకుల ప్రచారం**

కామారెడ్డి/రాజంపేట్/భిక్కనూరు/బీబీపేట్/ దోమకొండ, నవంబర్ 19 : కామారెడ్డి నియోజకవర్గంలో గులాబీ దండు ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తున్నది. తొమ్మిదిన్నర ఏండ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకూ వివరిస్తూ తమ దైన శైలిలో దూసుకెళ్తున్నారు. కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కామారెడ్డిలోని 15, 16, 17వ వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి ఆదివారం జోరుగా ప్రచారం నిర్వహించారు. కారు గురుకు ఓటు వేసి కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. 2వ వార్డులో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ ప్రచారం నిర్వహించారు. కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. రాజంపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ నర్మల్ల రాజు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భిక్కనూరులోని దళితవాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉప్పల బాబు, బీఆర్ ఎస్ నాయకుడు డప్పు రవి, దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీబీపేట్, దోమకొండ మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





కామారెడ్డిలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్







బీబీపేట్, భిక్కనూర్, యాడారం గ్రామాల్లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఓటు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, నవంబర్ 19 : ఓటును వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ప్రముఖ కవి యెనిశెట్టి గంగాప్రసాద్ రాసిన 'నీ భవితకు నీ ఓటే కీలకం ఓటు' గేయ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. యెనిశెట్టి గంగాప్రసాద్ రాసిన పుస్తకంలోని ప్రతి గేయం అందరిని ఆలోచింపచేసేలా ఓటు పై చైతన్యం తెచ్చే విధంగా ఉందని అన్నారు. ఇలాంటి రచనలు సమాజానికి ఉపయోగపడుతాయని అన్నారు. కార్యక్రమంలో పుస్తక రచయిత యెనిశెట్టి గంగాప్రసాద్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, ప్రముఖ కాలమిస్టు డాక్టర్ లచ్చయ్య, డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పీవీ నరసింహం, తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, ప్రధాన కార్యదర్శి అల్లిమోహన్ రాజ్, ఉపాధ్యక్షుడు మంద పీతాంబర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కామారెడ్డి, నవంబర్ 19 : జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఆదివారం కామారెడ్డి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 50 మంది పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ రెండో వారం హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రంజిత్ మోహన్, ఉపాధ్యక్షుడు సునీల్, జనరల్ సెక్రటరీ నరేశ్, భాస్కర్‌రెడ్డి, అనిల్ కుమార్, రాజేందర్ రెడ్డి, సంజీవ్, రేణుక, విజయ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి

కామారెడ్డి, నవంబర్ 19 : దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని విజ్ఞాన్ దివ్యాంగుల సేవా సమితి వ్యవస్థాపకుడు చిప్ప దుర్గాప్రసాద్ అన్నారు. కామారెడ్డిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా సోమవారం జిల్లా కేంద్రంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధుల చైర్మన్ డాక్టర్ వాసుదేవరెడ్డి రానున్నారని తెలిపారు. దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని ఆయన కోరారు. భవిష్యత్తులో దివ్యాంగుల సంక్షేమ, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు బాల్‌రెడ్డి, ఈశ్వర్, నర్సింహులు, సిద్ధరాములు తదితరులు పాల్గొన్నారు.

## రూ.3.26 లక్షల అక్రమ మద్యం స్వాధీనం

కామారెడ్డి రూరల్, నవంబర్ 19 : కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నమల్లారెడ్డిలోని ఓ ఇంట్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచారని అందిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది, అధికారులతో కలిసి దాడి చేశామన్నారు. బాణాల చిన్న పెద్దులు అనే వ్యక్తి ఇంట్లో తనిఖీ చేయగా సుమారు రూ.3,26,370 విలువైన మద్యాన్ని సీజ్ చేశామన్నారు. దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎవరైనా అక్రమ మద్యం నిల్వ చేయడం, విక్రయించడం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.